www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 25 జూన్ 2023

5



వైఎస్ఆర్

విద్యార్థినుల ఇబ్బందులు పట్టవా? : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులు పూర్తి కాక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్ నాయక్, ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ తెలిపారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను వారు సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ లో తరగతులు ప్రారంభమైనా కళాశాలలో నాడు- నేడు పనులు పూర్తి కాకపోవడంతో తరగతి గదుల నిర్మాణం పూర్తి కాకుండానే పాఠాలు వినాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. తరగతి గదిలో బోర్డులు కూడా సరిగా లేవని తెలిపారు. 1250 విద్యార్థినిలు ఉండగా 18 బాత్ రూములు ఎలా సరిపోతాయని, వెంటనే పెండింగ్‌లో ఉన్న బాత్రూం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు

వైద్యఆరోగ్యశాఖలో గందరగోళం

సూపరింటెండెంట్లలో ముగ్గురికి బదిలీలు నో

డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ల బదిలీల్లో నిర్లక్ష్యం

మాడిఫికేషన్ పేరిట ప్రత్యేక ఉత్తర్వు జారీ

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసినప్పటికీ మాడిఫికేషన్ పేరుతో కొనసాగుతూనే ఉంది. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో డిఎంహెచ్ఒ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని వేలాది మంది ఉద్యోగులకు బదిలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా బదిలీలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆఫీస్ సూపరింటెండెంట్, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల బదిలీలను ఇష్టానుసారంగా చేశారనే విమర్శల నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ జోన్-4లో సుమారు 23 విభాగాల్లో సుమారు ఎనిమిది వేల మంది ఉద్యోగులు ఉన్నారు. కడప రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయంలో నాలుగు ఉమ్మడి కడప జిల్లాలకు చెందిన ఉద్యోగులకు ఇటీవల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. 700 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 శాతం నిబంధన కింద రెండేళ్ల రిక్వెస్ట్, ఐదేళ్ల కాలపరిమితి కలిగిన ఉద్యోగుల పారామీటర్ల కింద 525 మంది బదిలీలకు అర్హులైనట్లు సమాచారం. జోన్-4 పరిధిలో పాత ఉమ్మడి నాలుగు జిల్లాల్లో 55 మంది ఆఫీస్ సూపరింటెండెంట్లు ఉన్నారు. వీరికి 30 శాతం బదిలీ నిబంధనల కింద 16 మందిని బదిలీ చేయాల్సి ఉంది. నలుగురు సీనియారిటీ కలిగిన ఆఫీస్ సూపరింటెండెంట్లు మాత్రమే బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఒక్కరికి మాత్రమే బదిలీ చేసి మిగిలిన ముగ్గురిని అదేస్థానాల్లో యథా తథంగా కొనసాగించడం వెనుక మతలబేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ముగ్గురిలో ఎవరు కూడా ఎలాంటి సిఫారసు లెటర్లు కలిగిన జాబితాలో లేకపోవడం గమ నార్హం. వీరిలో ఒకరు తిరుపతి కావాలని కోరుకున్నప్పటికీ బదిలీ చేయక పోవడం గమనార్హం. మరొకరు అనంతపురం కావాలని కోరినప్పటికీ తథా తథంగా కొనసా గించడం విశేషం. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన ఓ సూపరింటెండెంట్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీ జాబితాలో చూపించకపోవడం గమనార్హం. బదిలీలు ముగిసిన అనంతరం మాడిఫికేషన్ కింద కడప జిజిహెచ్‌కు ప్రత్యేక ఉత్తర్వుల పేరుతో బదిలీ చేయ డం విస్మయాన్ని కలిగించింది.



తంతుగానే స్టాటిస్టికల్ ఆఫీసర్ల బదిలీలు

జోన్-4 పరిధిలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ 15 మంది ఉన్నారు. 30 శాతం బదిలీల నిబంధనల కింద నలుగురిని బదిలీ చేయాల్సి ఉంది. ఇద్దరు అర్హులు ఉన్నప్పటికీ ఏఒక్కరినీ బదిలీ చేయకపోవడంపై విమర్శలు ఉన్నాయి. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ బదిలీల్లో మాయాజాలమే నడిచిందనే విమర్శలు ఉన్నాయి. 21 మంది అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు ఉండగా 30 శాతం నిబంధన కింద నలుగురు అర్హులైన ఉద్యోగులు ఉండగా ఇద్దరిని మాత్రమే బదిలీ చేయడం గమనార్హం. మిగిలిన ఇద్దరిని యథాతథంగా ఉంచడమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకున్న తప్పిదాలపై కొంతమంది ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే ప్రయత్నాల్లో ఉండడం గమనార్హం. దీనిపై ఆర్‌డి అనిల్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం పలుమార్లు చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

రీసర్వే పనుల పూర్తికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపట్టిన ఫేజ్ -2 రీసర్వే పనులు, ప్రాధాన్యత భవనాల నిర్మాణ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు,జెలను ఆదేశించారు. శనివారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా 'జగనన్నకు చెబుదాం', 'జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకం' ప్రాధాన్యత భవనాల నిర్మాణాల తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతి మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి సమీక్ష చేశారు. కార్యక్రమనికి కలెక్టరేట్‌లోని విసి హాలు నుండి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా, అత్యంత నాణ్యమైన, సంతృప్త స్థాయిలో పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పూర్తికి రోజువారి లక్ష్యాలు నిర్దేశించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రెండవ దశలో 89 గ్రామాల్లో చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా మొత్తం 64 గ్రామాల్లో రీసర్వే, 32 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తిచేశామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట్రావు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులురెడ్డి, ల్యాండ్స్ సర్వే ఏడీ మురళీ కృష్ణ, డిస్ట్రిక్ట్ ఆరోగ్యశ్రీ కో- ఆర్డినేటర్ బాలంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

పిఎల్ఎ ద్వారా సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి

ప్రజాశక్తి - కడప

పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ భవనంలో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో ప్రజా ప్రాయోజిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై సంబందిత జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా జిల్లా ప్రధాన జడ్జితో పాటు పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్. ప్రసాద్, జిల్లా అడిషనల్ సబార్డినేట్ జడ్జి ఎం.ప్రదీప్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ 'పర్మనెంట్ లోక్ అదాలత్' వ్యవస్థను ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కలిగివున్న వారందరికి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న ఈ వ్యవస్థ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టానికి లోబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వంచే ఏర్పాటు చేశారన్నారు.ఈ పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని తెలిపారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాంతరాలు, లోపాల వల్ల జరిగే నష్టాలకు సంబంధించి త్వరితగతిన న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. అనంతరం పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్, డిఎల్ఎస్ఎ సెక్రెటరీ మాట్లాడుతూ ప్రజా ప్రాయోజిత సేవల్లో లోపం, పరిహారం కోసం దావా, సొమ్ము వసూలు, పర్మనెంట్ లోక్ అదాలత్, ప్రజా ప్రయోజిత సేవలలో లోపాలతో కలుగు నష్టాలపై వచ్చే ఫిర్యాదులకు సంబందిత ప్రజా ప్రాయోజిత శాఖల అధికారులు ఎలా స్పందించాలి.. తదితర అనేక అంశాలపై సంబందిత జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డ్వామా పీడి యదుభూషన్ రెడ్డి, ప్రజా ప్రాయోజిత సేవా రంగాలకు చెందిన సంబందిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు, ఆయన్ను సన్మానిస్తున్న సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప

దేశంలోనూ, రాష్ట్రంలోనూ సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. శనివారం జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్ స్కూల్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయనకు పార్టీ శ్రేణుల్తు డప్పువాయిద్యాల నడుమ ఆయనకు స్వాగతం పలికారు. ర్యాలీ పార్టీ కార్యాలయం వరకు నిర్వహించారు. నగర అధ్యక్షులు విష్ణుప్రీతమ్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిజంగా గౌతమ్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా కడప ఉక్కు ఫ్యాక్టరీ పూసే లేదన్నారు. చెన్నూరు చక్కర కర్మాగారం తెరిపిస్తామని చెప్పి ఇంతవరకు అతీగతి లేదన్నారు. సీఎం సొంత జిల్లాలో, రాష్ట్రంలో హత్యలు అధికమయ్యాయని వాపోయారు. 25 ఎంపీ స్థానాలు వైసీపీకి ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తానని చెప్పిన జగన్ ఇంతవరకు ఎందుకు తీసుకురాలేకపోయాడో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొట్టమొదటి సంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై చేస్తుందన్నారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన విశాఖ సమావేశంలో సీఎం జగన్మోహన్ రెడ్డి అవినీతిపరుడు అని అమిత్‌షా అన్నారని, అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తంచేశారు. ఎపిసిసి కార్యదర్శి మేయ్యప్పన్ మాట్లాడుతూ టిడిపి, వైసిపిలు రెండూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు స్థానికంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయ కమిటీలను వేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి మాట్లాడుతూ మోడీ, బాబు, జగన్ ముగ్గురు రాయలసీమ ద్రోహులు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్, మైనార్టీ చైర్మన్ గాంధీ, యువజన విభాగం అధ్యక్షుడు రామారావు, రాష్ట్ర నాయకులు కమలమ్మ, బండి జకరయ్య నజీర్ అహ్మద్, గుండ్లకుంట్ల శ్రీరాములు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, రాష్ట్ర నాయకులు బొజ్జ తిరుమలేష్ పాల్గొన్నారు.

నేతలను సన్మానించిన సలావుద్దీన్

కడప అర్బన్ : నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌ఛార్జి మయప్పన్, ఏపీసిసి మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి ని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఘనంగా సన్మానించారు. సలావుద్దీన్ చేస్తున్న సేవలను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ అహ్మద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐ లతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ చేసి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహితంగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) తుషార్ డూడి, ప్రొద్దుటూరు అదనపు ఎస్‌పి ప్రేర్ణా కుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ప్రవీణ్ కుమార్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు పాల్గొన్నారు. **బంగారు భవితకు బాటలు ..** బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్‌పి అన్బురాజన్ ఆకాంక్షించారు. ప్రతిభ ఆధారంగా 45 మంది పోలీసు కుటుంబాలకు చెందిన టెన్త్, ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు ఎస్‌పి స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం నగదు ప్రోత్సాహకంగా స్కాలర్ షిప్‌లు, ప్రశంశా పత్రాలు అందజేశారు. పోలీసు పిల్లలతో ముచ్చటించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి

30న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజానికం మీద పెద్ద ఎత్తున విద్యుత్ భారాలు మోపుతున్నాయని, వీటిని ప్రతిఘటించేందుకు ఈనెల 30న నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద ఉన్న విద్యుత్ భవన్ వద్ద నిర్వహించే ఆందోళన జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని చిలకలబావి వద్ద సిపిఎం కడప నగర కమిటీ సభ్యులు పారుక్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారం సామాన్య ప్రజానీకం భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ సంస్థను అదాని, అంబానిలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ట్రూ అప్, సర్దుబాటు, ఇందన సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగధరల కంటే అదనంగా భారం పడుతున్నదన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 30న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ఎర్రముక్కపల్లి సెంటర్ నుంచి విద్యుత్ భవన్ వరకు ర్యాలీ, అనంతరం జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఫ్రోజ్ అలీఖాన్, టౌసిఫ్ పాల్గొన్నారు.

డ్రాయింగ్ పవర్ ఇవ్వాలి : యుటిఎఫ్

కడప అర్బన్ : ఎఫ్ఎసి ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ పవర్ ఇవ్వాలని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా ఖజానా ఉప సంచాలకులు వెంకటేశ్వర్లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించిన ఎంఇఒ-2 కౌన్సెలింగ్‌కు సంబంధించి జిల్లాలో కడప, ప్రొద్దుటూరు డివిజన్లల 23 మంది ప్రధానోపాధ్యాయలు ఎంఇఒలుగా బదిలీపై వెళ్లారని చెప్పారు. వారి స్థానంలో అదే ఉన్నత పాఠశాలలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్ కు ఎఫ్ఎసి బాధ్యతలను ఇస్తూ కడప డిఇఒ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఎస్‌టిఒలు డ్రాయింగ్ పవర్స్ అనుమతించవలసి ఉండగా, జిల్లా ఖజానా ఉపసంచాలకుల ఉత్తర్వులు వచ్చిన తర్వాతే వీటిని ఆమోదిస్తామని తెలిపారు. దీనివల్ల ఆలస్యం అవడంతో పాటు ఈ నెలలో జీతాలు పెట్టుకోవడానికి ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. అందుకు డిడి స్పందిస్తూ ఎఫ్ఎసి ప్రధానోపాధ్యాయులు జీతాలు బిల్లులు వెంటనే పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై రవికుమార్ సిద్దయ్య పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కడప

జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా కళాశాల విద్యాశాఖ ఆదే శాల మేరకు ప్రభుత్వ పురుషుల కళాశాల కడప నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంగ్ల మాధ్యమ శిక్షణా తరగతులు మూడవ బ్యాచ్ అధ్యాపకులు శనివారం విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 80 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. మారుతున్న ప్రపంచీకరణ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంచి విద్యార్థులలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఆంగ్ల భాషపై పట్టు సాధించే విధంగా అధ్యాపకులకు ముందుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ కుమార్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న నూతన అంశాలను తరగతి గదిలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, మాస్టర్ ట్రైనర్స్ కృష్ణవేణి, కృష్ణారెడ్డి, సహదేవ రెడ్డి, గురు మోహన్ రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

భాష్యం విద్యార్థుల ప్రతిభ

కడప అర్బన్ : జెఇఇ అడ్వాన్సుడ్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు ప్రతిభ చూపారని జోనల్ ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఐటిఐ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, అప్సరా సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 5,10 పది ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఈ ఘనత భాష్యం విద్యార్థులకే సాధ్యమైందని చెప్పారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే భాష్యం లక్ష్యమని తెలిపారు. సరైన ప్రణాళిక, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ

కడప అర్బన్ : ఆజాద్ నగర్‌లో ఉన్న బృందా స్ఫూర్తి వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో మీకోసం సేవా సంస్థ ఆధ్వంలో రూ.20వేల విలువచేసే నిత్యావసర వస్తువులు శనివారం అందజేశారు. ముఖ్య అతిథులుగా జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తాహిర్ మాట్లాడుతూ ఆర్ కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారు తమ జీవనోపాధి కోసం కువైట్ ఇతర దేశాలకు వెళ్ళి, జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వారు తమ కొచ్చే జీతంలో తమ మాతృభూమికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో, సభ్యులందరూ కొంత సొమ్ము పోగుచేసుకుని కొన్ని ఆశ్రమాలకు నెల నెలా నిత్యావసర వస్తువులు సాయం చేస్తున్నారని తెలిపారు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వల్లూరు : ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి శనివారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద రూ. 22 కోట్లతో వల్లూరు-పుష్పగిరి (8.6కి.మీ) డబుల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ప్రధానంగా ముందుకు వెళ్తోందని అన్నారు. వల్లూరు నుంచి పుష్పగిరి రోడ్డు ఇరుకుగా ఉంది ఆదినిమ్మాయిపల్లి, పుష్పగిరి పర్యాటక కేంద్రంగా ఉండడంతో అధికంగా వాహనాలు సంచరిస్తూ ఉంటాయని నిత్యం పర్యటకులు వస్తూనే ఉంటారని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ సిసి రోడ్లు నిర్మించి డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్రావు, జడ్‌పిటిసి వెంకటసుబ్బయ్య , మాజీ జడ్‌పిటిసి అబ్బిరెడ్డి వీరారెడ్డి , రాష్ట్ర వైసిపి యూత్ జనరల్ సెక్రెటరీ ఇంది రెడ్డి శంకర్ రెడ్డి, వల్లూరు సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి , కుమారుని పల్లి సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, బాలచంద్ర , ప్రవీణ్ కుమార్ సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేకులకుంట గ్రామ విఆర్ఒ సస్పెన్షన్

బ్రహ్మంగారి మఠం : మండలంలోని రేకులకుంట గ్రామానికి చెందిన గ్రేడ్ (1) విఆర్ఒ కోలా నరసింహులును సస్పెండ్ చేసినట్లు బద్వేల్ ఆర్‌డిఒ వెంకటరమణ ఒక ప్రటకనలో తెలిపారు. చట్టబద్ధమైన విధులను నిర్వర్తించేటప్పుడు తప్పుగా ప్రవర్తించినట్లు ఫొటోలు, వీడియో రికార్డింగ్ ద్వారా వాట్సాప్ గ్రూప్‌లో రావడం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎపి సివిల్ సర్వీసెస్ రూల్స్, 1991, రూల్ 8 లోని సబ్ రూల్ (1) మేరకు అతన్ని సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై 24 గంటలలోపు కోలా నరసింహులు తన వివరణను సమర్పించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

భూకబ్జా, సెటిల్‌మెంట్‌తోనే హత్య : టిడిపి

కడప అర్బన్ : వైసిపి నాయకుల భూకబ్జాల్లో సెటిల్మెంట్‌లో పొరపొచ్చాలతోనే పట్ట పగలు నడిరోడ్డుపై హత్య జరిగిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గాయత్రి టవర్స్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితి, ప్రజల మానప్రాణాలకు భద్రత ఎలా ఉందన్నది జరిగిన హత్య నిదర్శనమన్నారు. వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో మానబంగాలు, లూటీలు, భూ కబ్జాలు, ఇసుక , మైనింగ్ మాఫియా మితిమీరి పోయాయన్నారు. జగన్ సొంత జిల్లాలోనే పట్ట పగలు హత్యలు జరుగుతుంటే, పరిశ్రమలు నెలకొల్పేందుకు పెటుబడిదారులు ఎలా వస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నారా లోకేష్ వచ్చి వెళ్లిన తరువాత హత్య జరిగిందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చెప్పడం హస్యాస్పందంగా ఉందన్నారు. వైఎస్ వివేక నంద రెడ్డి హత్య పై రవీంద్రనాథ్‌రెడ్డి టిడిపి ఎమ్మెల్సీ బీటెక్ రవి పై నిందలు వేశారని గతాన్ని గుర్తు చేశారు. పోలీసులు నిష్పాతకంగా చర్యలు తీసుకొని, హత్య చేసిన వారికి శిక్ష పడేలా చూడాలన్నారు. సమావేశంలో ఎం.పి. సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : 'మేడా'

ప్రజాశక్తి ఒంటిమిట్ట

జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గడ్డం జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్నకు చెపుదాం అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కారిస్తామన్నారు. తవారుత మండల సమస్యలపై చర్చించారు. ముందుగా ప్రాథమిక వైద్యాధికారి మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలమని ఎలాంటి అంటు వ్యాధులు వచ్చిన ప్రజలు అప్రమత్తమై వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూపించుకోవాలన్నారు. ఈ విషయంలో కొంతమంది ప్రజాప్రతినిధులు గ్రామాల్లో హెల్త్ సెంటర్ పనిచేయడం లేదని, సరిగ్గా మాత్రలు మందులు ఇవ్వలేదని సభ దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ వైద్యులు ప్రతి గ్రామానికి వెళ్లి ఆయా హెల్త్ సెంటర్ల ద్వారా వైద్యం అందించాలని ఆయన సూచించారు. ఉపాధి ఎపిఒ మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో పనులు చేయించడానికి సరైన అవకాశాలు లేవని పేర్కొన్నారు. అందుకు ఎమ్మెల్యే మేడా కొండలు, వంకల్లో కంటే ప్రజలకు ఉపయోగపడే చెరువులు కాలువలు, గ్రామాల్లో పనులు చేయాలని ఆదేశించారు. ఎపిఎం నాగార్జున నాయుడు మాట్లాడుతూ ఉపాధి లో 50 నుంచి 500 వరకు గొర్రెలు కానీ, మేకలుకానీ పట్టుకోవచ్చని అందుకు రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు మంజూరవుతాయని తెలిపారు. తరువాత అటవీ, వ్యవసాయం, పశు తదితర శాఖలపై ఆయా అధికారులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పోరుమామిళ్ల టౌన్ : వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జున రెడ్డి అన్నారు. మండలంలోని అక్కల రెడ్డి పల్లి గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా ,ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రమౌళి, తహశీల్దార్ గంగయ్య, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సి. బాషా, రాజశేఖర్, ఎంపిటిసి రవి, బాలగురివిరెడ్డి, రామమోహన్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభ రీతిలో బోధించాలి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 రమాదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక అంగడి వీధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రమాదేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించడం, విశదీకరించడం, అన్వేషించడం, మూల్యాంకనం వీటిని ఉపయోగించి పాఠశాల ప్రాక్టికల్స్‌లో రూపొందించుకోవాలని తెలిపారు.

దారుణం! ప్రజా'దృష్టి'

జిల్లాలో దారుణ ఘటనల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం జనసంచారం ఎక్కువగా ఉన్న సంధ్యా సర్కిల్ ప్రాంతంలో పట్టపగలే హత్య చోటుచేసుకోవడం దిగ్భ్రాంతిని కలుగజేసింది. పోలీస్‌శాఖ పనితీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఓ భూసెటిల్మెంట్ వ్యవహారంలో వాటాల పంపకంలో తలెత్తిన విభేదాల కారణంగానే హత్య చోటుచేసుకుందనే వాదన ఎంత వరకు కరెక్టో తెలియదు కాదు కానీ పోలీసు విచారణలో గానీ తేలదని గమనించాలి. హత్య జరిగిన తీరుపై చర్చోపచర్చలు నడుస్తున్నాయి. బుర్ఖాలు ధరించిన వ్యక్తులు వేటకొడవళ్లతో ఎక్కువ జనసంచారం కలిగిన రోడ్డుపై దాడి చేసిన వైనం జుగుప్సను కలిగించిందనే చెప్పాలి. హతుడు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుని ముఖ్యఅనుచరుడు కావడం రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఇటువంటి తరహా హత్యలకు కళ్లెం వేయడమెలా అనే అంశంపై దృష్టి సారించాల్సి ఉంది. పోలీసులు భూకబ్జాలు, సెటిల్మెంట్లు, బెట్టింగులు, గంజాయి విక్రయాలపై గట్టిగా దృష్టి సారించాలి. ఎటువంటి రాజకీయ ఒత్తిడులను ఖాతరు చేయకుండా గట్టి చర్యలకు నడుంబిగించినప్పుడే ఇటువంటి హత్యలకు ముకుతాడు వేయడం సాధ్యమవుతుందని చెప్పవచ్చు. గట్టి సంకల్పంతోనే ఇటువంటి అరాచకాలను నిరోధించే అవకాశం ఉంది. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తమ పోస్టులను భద్రంగా ఉంచుకోవాలనుకుంటే హత్యలు షరామామూలుగా మారతాయి. కడప నగరంలో రాత్రివేళ పోలీస్ గస్తీని మెరుగు పరచాలి. రాత్రివేళ నిలిచిన, మొక్కుబడిగా మారిన బ్లూకోల్ట్ పోలీసుల కార్యాచరణను పకడ్బందీ పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది. సంధ్యా సర్కిల్‌లో చోటుచేసుకున్న హత్యా ఘటనను బ్లూకోల్ట్స్ పోలీసు కార్యదళం చురుకుగా ఉండి ఉంటే హత్యా ఘటన స్కెచ్‌ను పసిగట్టే అవకాశం ఉండేది. హత్యకు రెండు రోజులైనా రిహార్సల్స్ చేయడం కానీ, కాపు కాయడం కానీ చేసి ఉండేవారనడంలో సందేహం లేదు. రాత్రివేళ బ్లూకోల్ట్స్ పోలీసుల కదలికలు హత్య ఘటనను నిరోధించలేకపోయినా, అడ్డంకిగా మారి నేరస్తులు తప్పించుకోవడానికి ఉద్దేశించి ఏర్పాటు చేసుకున్న వాహనాలను గుర్తించే అవకాశం ఉండేదని వాదన వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు ఏడాది వ్యవధిలోపు ఉన్న నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్నపాటి ఘటన చోటుచేసుకున్నా ముఖ్యమంత్రి జిల్లా కావడంతో శాంతిభద్రతలు క్షీణించాయనే పేరుతో రాష్ట్ర స్థాయి పతాక శీర్షికలకు ఎక్కుతుందని గ్రహించాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పకడ్బందీ కార్యాచరణను పట్టాలకు ఎక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సేవలందించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఇంటికెళ్లి అందజేయాలని మున్సిపల్ కమిషనర్ పడగాల జగన్నాథ్ సూచించారు. పట్టణ పరిధిలో 20వ వార్డులో జరుగుతున్న జగనన్న సురక్ష పథక సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పలు సేవలను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి వారికి అందవలసిన సేవలను గుర్తించి, సంబంధిత సచివాలయంలో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఒ గంగిరెడ్డి, డిపిఒ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ జగన్నాథ్

ప్రొద్దుటూరు : చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష పథకం అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక 7వ సచివాలయంలో శనివారం స్థానికులకు సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సమాజంలో పెనుమార్పులు జరిగాయన్నారు. గత పాలకుల్లా ఇచ్చిన మాటను మర్చిపోకుండా జగన్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా విద్యావ్యవస్థలో చాలా మార్పులు తీసుకొచ్చారన్నారు. సామాన్యులు తమ సమస్యల పరిష్కారానికి నిత్యం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగకుండా సచివాలయ వ్యవస్థ తెచ్చారన్నారు. 11శాఖల సిబ్బందిని ఏర్పాటు చేశారన్నారు. గ్రామ వాలంటరీ వ్యవస్థతో ఇంటింటికి తిరిగి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వం ప్రజలవద్దకు పాలన అని ప్రకటలకే పరిమితం చేసినప్పటికీ జగన్ ప్రభుత్వం చేతల్లో చూపుతోందని ఎమ్మెల్యే వివరించారు.

నవోదయకు గౌతమ్ పాఠశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక టీచర్స్ కాలనీలో ఉన్న గౌతం పాఠశాల విద్యార్థి నిమ్మకాయల శివప్రసాద్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సునీత తెలిపారు. ఆ మేరకు శనివారం శివప్రసాద్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యార్థి నవోదయ పాఠశాలకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. గౌతమ్ పాఠశాల ఏర్పాటు నుంచి ఉత్తమ ఫలితాలతోపాటు అనేక పోటీ పరీక్షల్లో ర్యాంకులను కూడా సాధించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.



శివప్రసాద్

నిత్యాన్నదానానికి ఎంపీ మిథున్‌రెడ్డి విరాళం

చక్రాయపేట : జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రూ.5 లక్షలు విరాళం ఇచ్చారని ఆలయ అధికారులు తెలిపారు. ఎంపీ గతేడాది అక్టోబర్‌లో స్వామివారి దర్శనానికి వచ్చిన సందర్భంగా ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజస్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విరాళం ఇవ్వమని కోరగా.. అందుకు ఎంపీ ఇచ్చిన హామీ మేరకు నగదు మొత్తాన్ని పంపించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

భూముల రికార్డుల పరిశీలన

చాపాడు :మండల కేంద్రమైన చాపాడు రెవెన్యూ పొలంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చాలని రైతులు చేసుకున్న దరఖాస్తులను శనివారం జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు పరిశీలిం చారు. చాపాడు రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 32లో 0.18 ఎకరాలు రైతులు వ్యవసాయ భూమిగా మార్చాలని దరఖాస్తు చేసు కున్నారన్నారు. రైతుల వద్ద ఉన్న పత్రాలు, రికార్డుల వివరాలను పరిశీలించారు. తహశీల్దార్ సుభానీ, సర్వేయర్ సాయిలత, విఆర్ఒలు ఫజల్, శ్రీనువాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ :స్థానిక శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి ట్రైల్స్, కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో 'మా ఊరి సినిమా' డిజె డాన్స్ స్టూడియో వారిచే చిన్నారులతో క్లాసికల్, జానపద నృత్యాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పిడియస్‌యు పట్టణ అధ్యక్షుడు విగ్నేష్ డిమాండ్ చేశారు. స్థానిక డిప్యూటీ డిఇఒ కార్యాలయం ఎదుట శనివారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందల నియోజవర్గ ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు పుస్తకాలు, ఫీజుల పేరుతో హాస్టల్ అనుమతి లేకపోయినప్పటికీ హాస్టల్ పేరుతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు నుండి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు పట్టణ నాయకులు మహేష్, చరణ్, హాసిం, అబూబకర్, అక్బర్, ఆసిఫ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

రేపటి నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం

దువ్వూరు :దువ్వూరు సచివాలయం-2లో సోమ, మంగళవారాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించాలి

పోరుమామిళ్ల టౌన్ :ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులందరికీ ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మండల ఆర్ఐ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ పేద పిల్లలు, కనీసం పుస్తకాలు కొనలేదని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిం చాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు విజయ భాస్కర్, చెన్నకృష్ణ, గురుమోహన్, వంశీ, ఖలీల్, సాగర్, పోలయ్య, పీరయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

చింతకొమ్మదిన్నె : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ నాగరాజు, అదనపు డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లో మందుల స్టాక్‌ను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు ఇమ్యునైజేషన్ చేశారా లేదా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఇళ్ల సమీపంలో ఉన్న నీటి గుంతలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండడం, రికార్డులు సక్రమంగా ఉండడంతో డాక్టర్ రాఘవేంద్రను అభినందించారు. వారి వెంట హెల్త్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, జయ రత్నమ్మ, స్రవంతి, ఆశావర్కర్లు ఉన్నారు.

విద్యాశాఖధికారి సేవలు మరువలేనివి

పోరుమామిళ్ల : మండల విద్యాశాఖ అధికారి రఘు రాములు సేవలు మరువలేనివని ఎంఇఒ రత్న స్వామి పేర్కొన్నారు. శనివారం గోపవరం బదిలీపై వెళ్లిన రఘురాములను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఇఒగా సుదీర్ఘ కాలంపాటు పనిచేసి ఉపాధ్యాయుల ఆదరాభిమానాన్ని పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణా రెడ్డి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు బాల అంకిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

తగ్గిన సాగు విస్తీర్ణం - పెరిగిన ధరలు - కిలో రూ.100పైనే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



పచ్చి మిర్చి ధరలు భగ్గుమంటున్నాయి. కొరికి తినకుండానే మంట పుట్టిస్తుంది. నెల రోజుల్లోనే దీని ధర రెట్టింపై కొండెక్కి కూర్చుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర.120 పలుకుతోంది. సామాన్య ప్రజలు పచ్చి మిర్చి కొనాలంటే హడలి పోతున్నారు. బాపట్ల, గుంటూరు, రేపల్లె, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో మిర్చి పంట సాగు ఈ ఏడాది బాగా తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మిర్చి సాగుకు ఖర్చు ఎక్కువ అవ్వడమే సాగు విస్తీర్ణం తగ్గడానికి ఓ కారణంగా రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా పంట కోత సమయంలో ఎక్కువగా కూలీల అవసరం ఉంటుంది. ప్రస్తుతం రోజుకు ఒకొక్కరికి రూ.300 నుంచి రూ.400 వరకు కూలి ఇవ్వాల్సి ఉందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది.

విస్తీర్ణం తగ్గడంవల్లే ధరలు పెరిగాయి



పక్క జిల్లాల్లో పంట విస్తీర్ణం తగ్గడంతో ధరలు అధికంగా పెరిగాయి. గుంటూరు జిల్లా నుంచి అధికంగా మిరప కాయలు తీసుకొచ్చి అమ్మేవారం. అక్కడ విస్తీర్ణం తగ్గడంతో ధరలు పెరిగాయి.

- దస్తగిరి, వ్యాపారి, పులివెందుల

వాడడం తగ్గించాల్సి వస్తోంది..

పచ్చిమిర్చి కిలో ధర రూ.120 ఉండడంతో వాడకం తగ్గించాల్సి వస్తోంది. అవసరమైన వాటికి ఉపయోగిస్తున్నాం. ఎన్నడూ లేనివిధంగా మిర్చి ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి. మిర్చి ధరతోపాటు ఇతర నిత్యావసరాల వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి.

- నాగవేణి, పులివెందుల

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్మార్ట్ మీటర్ల విధానం, విద్యుత్ ఛార్జీల పెంపును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని నేతలు డిమాండ్ చేశారు. స్థానికంగా సిపిఎం ఆధ్వర్యంలో శనివారం అఖిల పక్షాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి శివనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కాటా రామదాసు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బిర్రు నెల్సన్, మాల మహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి పొన్నతోట జయచంద్ర, ఆల్‌ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంత్రి శ్రీను, బుడగ జంగం సంఘం జిల్లా అధ్యక్షులు నల్లప్ప, మానవతావాదుల సంఘం నాయకులు సంతోష్, జాతీయ చేనేత ఐక్యవేదిక దక్షిణ భారత దేశ కన్వీనర్ కొండప్ప, ఆర్‌పిఎస్ నాయకులు లింగమయ్య, ఆర్‌విపిఎస్ రాష్ట్ర కార్యదర్శి పాములేటి, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజానీకంపై విద్యుత్ భారాలు మోపడం బాధాకరమన్నారు. కేంద్రంలోని బిజెపికి వంతపాడుతూ రాష్ట్రంలో రైతుల మోటర్లకి మీటర్లు పెట్టాలని నిర్ణయించడం శోచీయమన్నారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత సంఘం నాయకులు బిర్రు పిలిప్, చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మి నారాయణ, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో నినదిస్తున్న వివిధ సంఘాల నాయకులు

బ్రహ్మసాగర్ నీటిని తరలించడం తగదు



నిరసన తెలుపుతున్న రైతుసేవా సంఘం నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మసాగర్ నుండి 1.5 టిఎంసి నీటిని కడపకు తరలించడం తగదని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రైతు సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మైదుకూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని ఎడారి నియోజకవర్గాలైన మైదుకూరు, బద్వేల్ రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు అయిదుళ్లుగా నీరు పూర్తిస్థాయిలో ఉన్నా.. పంట కాలువలు పూర్తి కాకపోవడంతో ఆయకట్టు రైతులకు నీరు అందడంలేదన్నారు. పిల్లకాలువలు పూర్తి చేయలేని ప్రభుత్వం ఇప్పటికే బ్రహ్మసాగర్ నుండి ప్రతిరోజూ 20 క్యూసెక్కుల నీటిని ఆర్‌టిపిపికి తరలిస్తోందన్నారు. మళ్లీ కడపకు తాగునీటకి, కొప్పర్తి పారిశ్రామికవాడ కోసం నీటిని తరలించాలనుకోవడం అన్యాయమన్నారు. కడపకు కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా నది నుండి తరలింపు కోసం ప్రయత్నాలు చేయకుండా, 60 కిలోమీటర్ల దూరంలో ఉండే బ్రహ్మసాగర్ నుండి నీటిని తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైందికాదన్నారు. నీటి తరలింపును వ్యతిరేకిస్తూ మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గ రైతులు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల పోరాటానికి అన్ని రాజకీయ పక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ ప్రజాసంఘాలు కలిసి రావాలని కోరారు. నిరసన కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, సమితి సభ్యులు నాగరాజు, కత్తి నాగిరెడ్డి, కొండయ్య, గోశెట్టి రాఘవ, మాధవరెడ్డి, ప్రజాపక్షం కన్వీనర్ గోశెట్టి వెంకటరమణయ్య, లెక్కల శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అధికారులను ఆదేశించారు. మైదుకూరు మున్సిపాలిటీలోని 11వ వార్డులో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికెళ్లి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలతో తమకు ఎంతో లబ్ధి చేకూరిందని వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డులో కూరగాయల దుకాణం వద్ద కాసేపు ఆగి అన్ని రకాల కూరగాయల ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కూరగాయలు సాగు సీజన్ కాకపోవడంతో ధరలు ఎక్కువగా ఉన్నాయని దుకాణదారుడు ఎమ్మెల్యేకు వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర అందుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రంగస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, భరత్, రవిశంకర్‌రెడ్డి, కౌన్సిలర్ పిల్లి ఇందిరా, వైసిపి నాయకులు లింగన్న, రవి, సచివాలయం సిబ్బంది, సంబంధిత అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అవినీతి భాగోతాలపై సమగ్ర విచారణ జరపాలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠంలో రోజురోజుకూ రెవెన్యూ శాఖలో అవినీతి విచ్చలవిడి అయిపోయిందని, గతంలో తహశీల్దార్ దైవాదీనం, సత్యానందం విధులు నిర్వహించే సమయంలో జరిగిన ఆన్‌లైన్, రెవెన్యూ అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. విఆర్ఒ నరసింహులులే కాకుండా ఇలాంటి విఆర్ఒలు మఠంలో చాలామంది ఉన్నారని తెలిపారు. వీరిపై కూడా విచారణ చేపట్టాలన్నారు. సర్వేయర్ వెంకటలక్ష్మి దాదాపు పదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా, 2007, 2008 సంవత్సరంలో ఇచ్చిన అసైన్మెంట్ భూములను కూడా చూపించలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డారని స్థిరా స్థులు, వాహనాలు, స్థలాలు కొనుగోలు చేసిన దాఖ లాలున్నాయని ఆరోపించారు వీటిపై విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయించాలని కోరారు. సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలంలో 1397 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని సర్వే చేయమంటే ఎక్కడో ఉన్న గాలిమరల సంస్థకు అప్పగించినామని సర్వేయర్ చెప్పారన్నారు. ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించడంలేదన్నారు. మఠం రెవెన్యూ అవినీతికి కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు కూడా సంబంధాలున్నాయన్నారు. వీటిపై కూడా నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. విచారణ ఆలస్యమైనా, సరిగ్గా నిర్వహించకపోయినా ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చ రిం చారు, సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్, కమిటీ సభ్యులు హరి, అజయ్, నరసింహులు, రాహుల్ పాల్గొన్నారు.

'యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన'

ప్రొద్దుటూరు : సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన విద్యావ్యవస్థ యథేచ్ఛగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాపరెడ్డి, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి శనివారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక భాష్యం పాఠశాల యాజమాన్యం శనివారం పసిపిల్లల ద్వారా కిలోమీటర్ల కొద్దీ నడిపించి వారిని ప్రచారానికి వినియోగించారని ఫొటోల ద్వారా చూపించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ర్యాలీ వల్ల స్థానిక శివాలయం సర్కిల్‌లో, రాజీవ్ సర్కిల్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం అవుతు న్నప్పటికీ పోలీసులు వీరికి ఎలా అనుమతిచ్చారో తెలియడం లేద న్నారు. పాఠశాల సాధించిన ర్యాంకులను ఎండలో ప్రచారం చేస్తూ రెండు గంటలపాటు పిల్లలను తిప్పడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

పేదలను ఆదరించాలి

ప్రొద్దుటూరు: పేద విద్యార్థులను ఆదరించి, వారికి మంచి విద్యను అందించినప్పుడే వారి నుండి అద్భుతాలు చూడగలమని సృజన్ ట్యుటోరియల్ కాలేజి అధినేత సునీల్‌కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శని వారం పేద విభిన్న ప్రతిభా వంతుల కుటుం బాల విద్యా ర్థులకు పలకలు, పుస్త కాలు, పెన్ను లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ సహాయంతోపాటు వారికి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ కూడా ఇస్తామన్నారు. ఆల్‌ఆఫ్‌యు విభిన్నప్రతిభావంతుల సొసైటీ అధ్యక్షుడు అఫ్జల్, గౌరవాధ్యక్షులు చలపతిరావు మాట్లాడుతూ అన్ని దానాల కన్న విద్యాదానం గొప్పదన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప అర్బన్ : ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కే. సురేష్ బాబు అన్నారు. శనివారం నగరంలోని అపూర్వ కల్యాణమండపంలో కెకెఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తారీక్ ఆధ్వర్యంలో బ్లడ్ వారియర్ అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం రోజున రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్న రక్తదాతలను అభినందించారు. రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన రక్తదాతలను సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప రెడ్డితో కలిసి అభినందించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, జావీద్ రక్త దాతలు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లల్లో అటవీ అధికారులు

- మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అటవీ అధికారులు ఎర్రచందనం, ఫారెస్ట్ భూములను అమ్ముకొని ఇటుక బట్టీల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి ఆరోపించారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఆయన డిప్యూటీ డిఎఫ్ఒ దివాకర్‌ను కలిసి అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బద్వేల్, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమరవాణా వీరి అధీనంలోనే పక్కదారి పడుతోందన్నారు. పొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని సబ్ డివిజన్ అధికారి దివాకర్, మరో అధికారి లక్ష్మయ్య ఈ ప్రాంతాన్ని దోచు కుని దాచుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం దగ్గరలో చెక్క మిషన్ రెన్యువల్‌కు జనవరి నెలలో దరఖాస్తు ఇస్తే ఇంతవరకు పంపలేదన్నారు. కారణం లక్షల్లో లంచాలు ముట్టజెప్పలేదన్నారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి సూచించారు. స్థానిక సబ్‌జైలులో శనివారం జడ్జి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ మార్గాన పరిష్క రించు కోవచ్చన్నారు. వరకట్న నిషేధం, 498ఎ, మోటర్ బైక్‌ల ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాది పాలాజి రవి, జైల్ సిబ్బంది, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి భార్గవి

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వేంపల్లె తెలుగు తమ్ముళ్ల సంఘీభావం తెలిపారు. శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, పివి రమణ, భాస్కర్‌రెడ్డి (ఎల్‌బిఆర్)తోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

రాష్ట్రంలోని పేద పిల్లలు మంచి భవిష్యత్ లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 1వ వార్డు బొల్లవరం పురపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. 78 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. నేటి విద్యార్థులు ఉన్నతోద్యోగాలు పొందాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కాకర్ల నాగశేషారెడ్డి, వార్డు కౌన్సిలర్ సరోజమ్మ, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయ కుడు చాడా లక్ష్మిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న పోరెడ్డి నరసింహారెడ్డి